

An Accomplished Author With World-Wide Releases
Of Two Of His English Novels
"The Enemy of the Mankind" and
"The Dictator of the Dark"

# సూర్యదేవర రామ్ మోహన రావు

**AUTHOR OF HIGHEST NUMBER OF NOVELS IN TELUGU**
**AUTHOR OF HIGHEST NUMBER OF NOVELS TRANSLETED INTO KANNADA**



# అధర్వణ యజ్ఞం

# అధర్వణ యజ్ఞం

సూర్యదేవర రామ్‌మోహన రావు

# అధర్వణ యజ్ఞం

-సూర్యదేవర రామ్‌మోహనరావు

సిటీ పొలిమేరకు రెండు కిలోమీటర్ల దూరంలో హైవేనానుకొనివున్న చిట్టడివి ప్రాంతం. హెవీ కరెంట్ లైను కోసం విద్యుత్ శాఖ వారు ఎగువనుంచి ఎత్తయిన పోల్స్‌ని వేసుకుంటూ వస్తున్నారు. హైవేకు మూడువందల గజాల దూరంలో పోల్స్ నిర్మాణం కోసం లోతయిన గుంతలు తీశారు. ఆ రోజుతో పని ఆపి వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళిన కొద్దిసేపటికే....

వారు తవ్వినచోట విచిత్రంగా-

గుంత.... బొందగా.....

బొంద..... లోయగా....

లోయ సొరంగంగా మారిపోయింది.

తెల్లవారి తిరిగి పని ఆరంభించటానికొచ్చిన డిపార్ట్‌మెంట్ వాళ్ళకి అక్కడ గుంతలకి బదులు సుమారు ఏభైమీటర్ల వ్యాసంలో భూమిలోకి ఏర్పడిన సొరంగం కనబడి కంగారు పుట్టించింది

ఏం జరిగింది?

నిశ్శబ్దంగా రాత్రికి రాత్రి భూమి కృంగిపోవటం ఏమిటి?

నిలువునా సొరంగం ఏర్పడటం ఏమిటి?

తొంగిచూసిన వారికి చీకటితప్ప ఏమీ కన్పించలేదంటే అది ఎంత లోతుకు ఏర్పడిందో అర్ధమవుతుంది. పైగా అంత లోయగా సొరంగం ఏర్పడినా, చుక్కనీరు కూడా పొంగి రాకపోవటం వింతల్లో వింత.

క్షణాల్లో ఈ వార్త సిటీలోకి వ్యాపించిపోయింది.

పోలీసులు వచ్చారు.

జనం ఎవరూ సొరంగం అంచులవద్దకి పోకుండా సొరంగాన్ని చుట్టి బారికేడ్లుకట్టి కాపలా వున్నారు. మీడియావాళ్ళు పరుగులెత్తుకొచ్చి ఫోటోలు తీసారు.

శాస్త్రవేత్తల బృందాలు వచ్చి పరిశీలించాయి. పూర్వకాలం ఎప్పుడో భూగర్భంలో తవ్విన సొరంగం కారణంగా పైనేల ఆ సొరంగంలోకి దిగబడి వుంటుందని కొందరు, భూమికి రంధ్రం పడిందని కొందరు, పరిశోధనలు జరిపితేగాని వాస్తవంగా ఏం జరిగివుంటుందో అంచనా వేయలేమని కొందరు శాస్త్రవేత్తలు. ఎవరికి తోచింది వాళ్ళు విశ్లేషించుకుని వెళ్ళారు. జనం తండోప తండాలుగావచ్చి ఈ విచిత్రాన్ని చూసి పోతున్నారు. మూడు రోజులు గడిచిపోయాయి.

"అరె అనుపమ్? నీకీ విషయం తెలుసా?"

బైక్ స్టార్ట్ చేయబోతున్న అనుపమ్ వద్దకి పరుగెత్తుకుంటూ వచ్చి చెప్పాడు గిరిధర్.

వాళ్ళంతా ఇంజినీరింగ్ స్టూడెంట్స్.

కాలేజి వదిలి ఇంటికి బయలుదేరుతున్న టైం.

అనుపమ్ వయసు పాతికేళ్ళు.

ఆరడుగుల ఎత్తు, దబ్బపండు రంగు, వంకీలజుత్తుతో చూడగానే ఆకర్షించే అందమైన యువకుడు. చాలా మంచివాడని, బెస్ట్ స్టూడెంట్ అనీ కాలేజీలో పేరుంది. ఎప్పుడూ వెంట పదిమంది స్నేహితులుంటారు. ఇప్పుడు కూడా వాళ్ళంతా అక్కడే వున్నారు.

"ఏ విషయం రా?" అంటూ గిరిధర్‌ని అడిగాడు.

"అదేరా.... సిటీ బయట ఏర్పడ్డ సొరంగం గురించి" చెప్పాడు గిరిధర్.

"ఏమైంది? మళ్ళీ కొత్తగా ఇంకో సొరంగం ఏర్పడిందా? రోజూ పేపర్లలో ఫోటోలతో సహా రాస్తూనే వున్నారుగదా." అదో విశేషమే కాదన్నట్టు తీసిపడేసాడు అనుపమ్.

అయినా గిరిధర్ వదల్లేదు.

"ఒరే! మన చదువులు, పనులు ఎప్పుడూ వుండేవే. పేపర్లో చదవి, టి.వి.ల్లో చూస్తే థ్రిల్ ఏముందిరా? ఓసారి మనం అక్కడికివెళ్ళి చూసి వద్దాం" అన్నాడు.

"నాకు ఇంట్రెస్ట్ లేదు. మీరు వెళ్ళిరండి" అన్నాడు అనుపమ్.

"ఒరే! మేమంతా వెళుతుంటే నువ్వు రాకపోడం బాగుండదు. మూడు రోజులుగా వెళ్ళి జనం విరగబడి చూస్తున్నారు. మనం కూడా వెళ్దాం" అన్నాడు మరో స్టూడెంట్.

మొత్తానికి అంతా పట్టుబట్టేసరికి–

ఒప్పుకున్నాడు అనుపమ్. కాని బైక్‌ను గిరిధర్ నడిపే షరుతుమీదనే ఒప్పుకున్నాడు. ఆరు బైక్‌ల మీద పదిమంది స్టూడెంట్స్ బయలుదేరారు. వాళ్ళంతా నగరం వెలుపల సొరంగం ప్రాంతానికి చేరుకునేసరికి

ఆరు కావస్తోంది సమయం. అవతల సూర్యుడు అస్తమించే సమయం గావటంతో సందర్శకులు చాలామంది వెనుతిరుగుతున్నారు. తమ బైక్‌లను హైవే దగ్గరలోనే లాక్‌చేసి, కాలినడకన అంతా అక్కడికి చేరుకున్నారు. చాలా మంది బారికేడ్లను దాటకుండా నిలబడి ఆ సొరంగాన్ని ఆశ్చర్య సంభ్రమాలతో చూస్తున్నారు. చీకటిపడితే అక్కడేమీ కన్పించదు. పైగా అది వూరు చివరి ప్రాంతం గాబట్టి చాలామంది వెనుతిరిగి వెళ్ళిపోతున్నారు.

అనుపమ్‌తోబాటు అంతా–

కుతూహలంగా ఆ పరిసరాల్ని సొరంగాన్ని చూస్తున్నారు.

సరిగ్గా అప్పుడే–

మరో అద్భుతం చోటు చేసుకుందక్కడ.

ఎవరూ వూహించని సంఘటన.

ముందుగా కాళ్ళకింద భూమి స్వల్పంగా కంపించటం ఆరంభించింది. అదే సమయంలో చుట్టూ గాలి కదలికలో వేగం పుంజుకుంది. సొరంగంలోంచి వింత వింత కాంతులు, మెరుపు రేఖల్లా గాల్లోకి దూసుకుపోసాగాయి. వాటితోబాటు విచిత్రమైన రణగొణ ధ్వనులు చెలరేగటం మొదలయింది.

ఏం జరుగుతుందో అర్థంగాక ఎక్కడి వాళ్ళక్కడ బొమ్మల్లా చూస్తూ నిలబడిపోయారు.

అంతలో భూకంపం వస్తున్నట్టు నేల దారుణంగా కంపించటం ఆరంభించింది. దుమ్మూ ధూళితో కూడిన సుడిగాలి ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి అందర్నీ ఉక్కిరిబిక్కిరి చేయనారంభించింది. కంటి ముందు ఏముందో కనిపించని పరిస్థితి. సొరంగంలోంచి చెవులు దిబ్బళ్ళు పడేలా విచిత్రమైన ఆక్రందనలు గుండెల్ని పిండేసాయి. నేల ప్రకంపనలకు బారికేడ్లు కూలిపోయాయి, సొరంగం పంచనున్న చెట్టు కొంతమేర సొరంగంలోకి వాలిపోయింది.

ఉన్నట్టుండి ఏర్పడిన ఈ పరిణామాలు అక్కడున్న వాళ్ళని భయకంపితుల్ని చేసాయి. ప్రళయకాలం ఎలా వుంటుందో గుర్తుచేసాయి. ఏ ఉపద్రవం విరుచుకు పడునుందోననే భయంతో ప్రాణాలు అరచేత పట్టుకుని గొర్రెల మందలా తలోదిక్కుగా పరుగులు తీసారు. తమ వాహనాల్ని చేరుకుని శరవేగంగా ఆ ప్రాంతాలకు దూరంగా పారిపోసాగారు.

ఇంజినీరింగ్ స్టూడెంట్స్ కూడా ఒకరినొకరు హెచ్చరించుకొంటూ రోడ్డు వరకు పారిపోయి వచ్చి, తమ బైక్‌లు ఎక్కేసారు. నగర సమీపంలోకి వస్తుండగా అప్పుడు గుర్తొచ్చింది గిరిధర్‌కి అనుపమ్ విషయం. తను నడుపుతోంది అనుపమ్ బైక్‌నే. కాని తన వెనక అతను లేడు. వేరే బైక్ ఎక్కాడేమోనని మిగతా బైక్‌ల వంక చూసాడు. అనుపమ్ జాడ లేదు.

“అరే.... అనుపమ్ కన్పించటం లేదురా?” అనరుస్తూ తన బైక్ ఆపాడు.

మిత్ర బృందమంతా షాక్‌తో ఆగిపోయారు. అనుపమ్ తమతో లేదన్న విషయం రూఢీ కావటంతో దిగాలు పడిపోయారు.

"పదండ్రా! ఓసారి వెనక్కి వెళ్ళి చూద్దాం" అంటూ తన బైక్‌ని వెనక్కి తిప్పాడు గిరిధర్.

అప్పటికి చీకటిపడింది.

వాతావరణం మామూలుగా వుంది.

ధైర్యం చేసి అంతా వెనక్కి వచ్చారు.

ఆశ్చర్యం!

ఇంతకుముందు ప్రళయాన్ని తలపించిన ఆ ప్రదేశం ఇప్పుడు ప్రశాంతంగా ఏమీ జరనట్టు అమాయకంగా ముఖంపెట్టి వెక్కిరిస్తున్నట్టుంది. చెదిరిపోయిన వాళ్ళలో కొందరు ఇప్పుడిప్పుడే వెనక్కి వస్తున్నారు.

భూ ప్రకంపనలు లేవు.

సుడిగాలుల్లేవు.

సొరంగంలోంచి అరుపులు, ఆర్తనాదాలు గాని, వింతయిన కాంతి కిరణాలు గాని లేవు. అన్నిటికి మించి అసలు ఇప్పుడక్కడ సొరంగమే లేదు. కూలిపోయిన బారికేడ్ల సాక్షిగా అక్కడ సొరంగం అదృశ్యమై నేల ప్రత్యక్షమైంది. నాగళ్ళతో దున్నినట్టు ఎగుడు దిగుళ్ళుగా మట్టి, రాళ్ళు రప్పలతో ఎవరో సొరంగాన్ని పూడ్చిపెట్టినట్టుంది. సొరంగంలోకి వాలిన చెట్టు సగం పూడుకుపోయి వుంది.

ఆ పరిసరాల్లో ఎక్కడా అనుపమ్ జాడలేదు.

అంతవరకు సొరంగానికి కాపలా వున్న గార్డ్‌లు ఫోన్‌లు చేసినట్టున్నారు. సైరన్లు మోగించుకుంటూ సిటీ నుంచి పోలీసు వాహనాలు దూసుకొచ్చాయి. మీడియా వాళ్ళు, శాస్త్రవేత్తలు తరలివస్తున్నారు.

అసలు ఆ సొరంగం ఎందుకు ఏర్పడిందో, తిరిగి ఎందుకు పూడుకుపోయిందో అది ఒక బదులుదొరకని యక్షప్రశ్న.

అనుపమ్ కన్పించటంలేదన్న విషయాన్ని–

పోలీసుల దృష్టికి తీసుకెళ్ళాడు గిరిధర్.

జరిగిన ఉపద్రవం మూలంగా ఒక్క అనుపమ్ తప్ప వేరెవరూ మిస్సయినట్టు పోలీసులకు రిపోర్ట్ అందలేదు. అనుపమ్ కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు పోలీసులు.

ఇకపోతే–

అసలక్కడ ఏం జరిగిందో? ఏం జరగబోతోందో అర్థంగాక మేధావులయిన సైంటిస్ట్‌లు కూడా తలలు పట్టుకున్నారు. మూడు రోజుల క్రితం సొరంగం ఏర్పడినప్పుడు అది భూమి మీద అరుదుగా జరిగే ఓ వింత సంఘటనగానే భావించి, దానిమీద పరిశోధనలకు పూనుకుని మూడు రోజులయినా గడవకముందే ఇప్పుడీ విచిత్ర సంఘటన చోటు చేసుకుంది.

నగరంలో ఎక్కడా జాడలేని భూకంపం ఇక్కడే రావటం ఏమిటి? అప్పటికప్పుడు తుఫానులాంటి సుడిగాలి ఏమిటి? సొరంగంలోంచి రంగు రంగుల కాంతిపుంజాలతోబాటు రోదనలు, ఆక్రందనల వంటి శబ్ధాలేమిటి? ఇందతా సైన్సు ప్రకారం జరిగిందనుకోడానికి లేదు. అలాగని దెయ్యాలు, పిశాచాల ఆగడమని అనుకోలేం. ఈ కాలంలో దెయ్యాలేమిటి? పిశాచాలేమిటి? ఏది ఏమైనా సైన్సుకి అందని విశేషం ఏదో జరిగిందక్కడ. దీనికి బలయిన ఒకే ఒక్క యువకుడు ఇంజినీరింగ్ స్టూడెంట్ అనుపమ్.

సుడిగాలి అతడ్ని తీసుకెళ్ళి అడవిలో ఎటయినా విసిరేసి ఉండొొచ్చన్న అనుమానంతో అర్థరాత్రి వరకు అడవిలో గాలించి ఆశ వదులుకున్నారు పోలీసులు. తప్పించుకుని అతడు సిటీలోకి వెళ్లిపోయినట్టుగా కూడ సమాచారం లేదు. అనుపమ్‌ది మిస్సింగ్ కేసుగా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మూడు రోజు కిందటే అక్కడ రాత్రిళ్ళు ఎవరూ సొరంగం వద్దకు పోకుండా రెండు విద్యుద్దీపాలు ఏర్పాటు చేసారు. అందులో ఒకటి ఇప్పుడు పాడయింది. దాన్ని సరిచేసారు ఎలక్ట్రిసిటీ వాళ్ళు. ఎందుకయినా మంచిదని పోలీస్ అధికారులు ఇద్దరు పోలీసుల్ని అక్కడ కాపలా వుంచారు.

మీడియా వేస్తున్న ప్రశ్నలకు బదులు చెప్పలేక జరిగిన సంఘటనల్ని ఎలా విశ్లేషించాలో తెలీక సైంటిస్ట్‌లు తలలు పట్టుకున్నారు. ప్రత్యక్ష సాక్షుల నుంచి వాళ్ళు చూసిన వివరాలు అడిగి తెలుసుకుని, వార్తా కథనాల్ని తయారుచేస్తున్నారు విలేకరులు.

మొత్తానికి ఆ రాత్రంతా అక్కడ హడావుడిగానే గడిచింది. కాని అనుపమ్ జాడ మాత్రం అంతుచిక్కకుండా పోయింది.

టి.వి. ఛానళ్ళలో జరిగిన సంఘటన వివరాలు, ఫ్లాష్ న్యూస్ వెళ్ళిపోయాయి. కొన్ని ఛానల్స్ సంఘటనా స్థలం నుంచే లైవ్ ప్రసారాలు కూడ కొనసాగించాయి. ఇక మరునాడు వార్తాపత్రికలలో అదృశ్యమైన సొరంగం గురించి, కన్పించకుండా పోయిన అనుపమ్ గురించే వార్తలన్నీ.

అనుపమ్ నిజంగానే చనిపోయాడా–

లేక మరో చరిత్రకు తెర తీయబోతున్నాడా–

ఏ విషయం కాలమే చెప్పాల్సి వుంది.

× × × ×

సరిగ్గా వారం రోజుల తర్వాత–

మరో కొత్త అంకానికి తెర లేచిందక్కడ.

ఆ రోజు రాత్రి ఎనిమిది గంటల సమయం.

శీతకాలం చలిగాలులు ఉధృతమవుతున్నాయి.

వణికించే చలిలో కూడ పోలీసు లిద్దరూ రగ్గుల్లో ముణగదీసుకొని చెట్టుకింద కూచున్నారు. పగలు డ్యూటీ చేసిన ఇద్దర్నీ ఆరుగంటలకు పంపించేసి వీళ్ళిద్దరూ ఆ ప్రదేశానికి కాపలా కాస్తున్నారు.

విద్యుత్‌శాఖ వాళ్ళు ఏర్పాటు చేసిన రెండు లైట్లలో మరలా ఒకటి పోయింది. రెండోది గుడ్డిగా వెలుగుతోంది.

పగలు అప్పటికీ అనేకమంది వచ్చి ఆ ప్రదేశాన్ని చూసి పోతున్నారు. ఈ వారం రోజుల్లోనూ కొత్త సంఘటనలేమీ చోటు చేసుకోలేదు. జరిగిన విచిత్ర సంఘటనలకి కారణాలేమిటో తెలుసుకోవటంలో సైంటిస్టులు కూడ విఫలమయ్యారు.

“ఎప్పుడో చేసుకున్న పాపంరా. లేకపోతే ఈ చలిగాలిలో మనకీ తిప్పలేమిటి? హాయిగా కొంపలో నిద్రపోవాల్సిన వాళ్ళం. ఇక్కడొచ్చిపడ్డాం” అన్నాడు మొదటి పోలీస్.

“అవును. ఏం చేస్తాం. తప్పదు గదా?” అన్నాడు అన్నీ తెలిసినవాడిలా రెండో పోలీస్.

“సిగరెట్ ముట్టించుకోవాలి. అగ్గిపెట్టె వుందా?” అడిగాడు రెండోవాడు.

దూరంగా హైవేలో గ౯య్‌న దూసుకుపోతున్న లారీ శబ్దం వినిపించింది. హెడ్‌లైట్ల కాంతి స్పష్టంగా కనబడుతోంది.

“అగ్గిపెట్టె లేదురా!” అన్నాడు మొదటివాడు.

“సరి. ఇక్కడే వుండు. అలా రోడ్డుమీదికెళ్ళి వెలిగించుకొస్తా” అంటూ టార్చ్‌లైటు, చేతికర్ర అందుకుని గొంగళి భుజాలమీదుగా కప్పుకొంటూ హైవే దిశగా చీకట్లో కలిసిపోయాడు రెండోవాడు.

పక్కన మనిషి లేకపోయేసరికి–

కొంచెం ఏదో జంకు అన్పించింది అక్కడున్న పోలీస్‌కి.

లేచి టార్చిలైటు, చేతికర్ర అందుకున్నాడు.

టార్చిలైటు చుట్టూ ఫోకస్ చేసాడు.

చుట్టూ కట్టిన బారికేడ్లు భద్రంగా వున్నాయి. పరిసరాల్లో ఎవరూ కన్పించటం లేదు. చలిగాలి అధికమవుతోంది. అడవిలో దూరం నుంచి నక్కల వూళలు నిశీధిని చీల్చుకొంటూ వినవస్తున్నాయి.

అంత దూరంలో ఒక మర్రిచెట్టు వుంది.

అది జడల విరబోసుకొని కూచున్న పిశాచలంలా వుంది.

ఎందుకయినా మంచిది ఓసారి కంచెను చుట్టి రావాలని బయలేదేరాడు. నడుస్తుంటే పాదాల కింద ఎండుటాకులు కరకరలాడుతున్నాయి. వాటి మధ్యగా ఎగిరెగిరి దూకుతున్న కప్పపిల్లలు అతడి పాదాల మీద పడుతున్నాయి. వాటికి బెదరటంలేదతను. కాని కాలికి ఏ వేరుగాని, తీగ గాని తగిలితే ఉలిక్కిపడుతున్నాడు. ఎందుకంటే– అది పాములు తిరుగాడే వేళ. పొరబాటు జరిగితే రేపు సూర్యోదయాన్ని చూడలేడు.

ఆ ప్రదేశాన్నంతా ఓసారి చుట్టి వచ్చి–

తిరిగి ఇంతకు ముందు కూచున్న అదే చెట్టుకిందకు వచ్చాడు. చెట్టు కొమ్మ జవజవలాడుతూ ఆకులు కదిలిన చప్పుడయింది.

ఎందుకో అతడి వెన్ను ఒక్కసారి జలదరించింది.

వెంటనే కొమ్మపైకి టార్చ్ ఫోకస్ చేశాడు.

అక్కడ కనిపించిన దృశ్యం అతడికి కంగారు పుట్టించింది.

సుమారు తొమ్మిది అడుగుల పొడవుంటే మచ్చలపాము ఒకటి ఆ కొమ్మకు చుట్టుకునుంది. కళ్ళు రేడియం బల్బుల్లా మెరుస్తున్నాయి. జాన పొడవున నాలుకలు తోడుతూ చుట్టలు విప్పుకుంటోంది. అది ఏ జాతి పామో కూడా అర్థంకాలేదు గాని ఖచ్చితంగా అది తనమీదకు దూకటానికే సిద్ధపడుతోందని అర్థమైంది. భయాన్ని అదుపు చేసుకుంటూ దాన్ని కొట్టే ఉద్దేశంతో చేతికర్రను దానిమీదకు విసిరాడు.

తన టైం బాగులేనట్టుంది.

కర్ర పాముకి తగల్లేదు.

పైగా చెట్టు కొమ్మల్లో చిక్కుకుపోయింది.

పాము ఎక్కడ మీదకు దూకుతుందోన్న భయంతో చెట్టుకింద నుంచి వేగంగా ఇవతలకు వచ్చేసాడతను. కాలికి ఏదో చుట్టుకుంటున్నట్టనిపించి ఎగిరి పక్కకు దూకాడు. టార్చ్ ఫోకస్ చేసాడు. పాము కాదు. ఏదో తీగ కాలికి అడ్డం పడింది.

తేలిగ్గా శ్వాస తీసుకుంటూ చుట్టూ చూసాడు.

సిగరెట్ ముట్టించుకొస్తానంటూ వెళ్ళిన పెద్దమనిషి ఇంతవరకూ తిరిగి రాలేదు. కోపం ముంచుకొస్తోంది.

మనసు తెలీని ఏదో ఆందోళనకు గురవుతోంది. ఏదో జరగబోతోందన్న అనుమానం క్రమంగా బలపడుతోంది.

ధైర్యాన్ని కూడగట్టుకుంటూ-

పక్కనున్న వాటర్ కేన్‌లోంచి-

గ్లాసులోకి వాటర్ వంచుకున్నాడు.

నిలబడే గ్లాసులో నీటిని మూడు గుక్కలు వేసాడు.

నాలుగో గుక్క వేయబోతూ ఆగిపోయాడు.

గ్లాసులో నీరు చెదిరి ముఖం మీద పడింది.

నిలువునా తను కంపిస్తున్నాడు.

ఏం జరిగింది?

పది సెకన్ల తర్వాత అతడికి అర్థమైంది.

ప్రకంపన తన శరీరంలో ఏర్పడింది కాదు. కింద భూమిలో ఏర్పడిన ప్రకంపన అది. క్రమంగా పెరుగుతోంది.

భూమి లోపల నుండి ఏవో పిడుగులు పరుగెడుతున్నట్టు కర్కశ ధ్వనులు క్రమంగా పెద్దవవుతున్నాయి. భూ ప్రకంపనలకి చేతిలో గ్లాసు జారిపోయింది.

భుజంమీది దుప్పటి జారిపోయింది.

చుట్టూ కర్రలతో కట్టిన కంచె కుప్పకూలుతోంది.

సారంగం మాయమైన స్థలంలో నేల పగుళ్ళు తీస్తోంది.

ఇక్కడ రెండుసార్లు అద్భుతాలు జరిగాయి. జరిగాయని తను విన్నాడు. ఆ విషయం తెలిసి వచ్చి చూసాడుగాని ఆయా సందర్భాల్లో తను ఇక్కడ లేడు. అందుకే మొదటి ఇది భూకంపం అనుకున్నాడు. మొదట అదటుకి ఎగిరివెళ్ళి అంత దూరంలోని పొదల్లో పడ్డాడు.

చేతిలో టార్చ్‌లైటు జారి ఎటో ఎగిరిపడింది.

అతను పొదల్లో పడ్డాక కూడా-

భూకంపం తీవ్రత కొంచెం కూడా తగ్గలేదు.

ఆకాశంలో రాత్రి పక్షులు కొన్ని దారుణంగా అరుచుకుంటూ దూరంగా ఎటో ఎగిరిపోతున్నాయి. ఎక్కడో గుడ్లగూబ అరుపు గుండెల్ని జలదరిస్తోంది. లేచి దూరంగా పారిపోవాలన్నా అతడి అవయవాలు సహకరించటం లేదు.

అతడు చూస్తుండగానే నేల గుండ్రంగా విచ్చుకుంది. లోపల నుంచి విచిత్రమైన రంగు రంగుల కాంతి కిరణ పుంజాల వినువీధికి దూసుకెళుతున్నాయి. లోపలనుంచి వికృత అరుపులవంటి శబ్ధాలేవో వినవస్తున్నాయి. ఆకాశం నిర్మలంగానే వుంది, కాని ఏమిటిది? ఈ సుడిగాలి ఎక్కడినుంచి వస్తోంది? భయంకరమైన సుడిగాలి. అది ఎంత బలంగా వీస్తోందంటే తనను ఎక్కడ పైకి లేపుకుపోతుందోనన్న భయంతో పక్కనున్న బలమైన మొక్కను గట్టిగా పట్టుకున్నాడతను.

చూస్తుండగానే అక్కడ సొరంగం ఏర్పడింది.

కళ్ళు చించుకుని అటే చూస్తున్నాడు.

అంత చలిలో కూడా–

అతడి నుదుట చెమటలు క్రమ్ముకున్నాయి.

మూడు నిమిషాలపాటు ఆ విపరీతాలను కళ్ళు చించుకుని చూస్తూనే వున్నాడతను. భూమి నాశనం కాబోతోందా అన్నంత భయం ఏర్పడింది. ఆ భయంలో వుండగానే భూమి లోపల్నుంచి మరో కొత్త శబ్ధాలు. “ధడ్.... ధడ్.... ధడ్!” అంటూ భూమిలోపల ఎవరో సమ్మెటలతో కొడుతున్నంత శబ్దాలు. బండల్ని కూలుస్తున్న ధ్వనులు.

భయంతో తన గుండె ఎక్కడ ఆగిపోతుందోనని కంగారుపడ్డాడు పోలీస్. గుండెలు చిక్కబట్టుకొని మరీ ఉద్వేగంగా చూస్తున్నాడు. జరుగుతున్న పరిణామాలకు తను ప్రత్యక్ష సాక్షి అంటే నమ్మలేకపోతున్నాడు.

ఇప్పుడు సొరంగంలోంచి వెన్నెల వెలుగులాంటి గండ్రటి కాంతి పుంజాలు నీటిజల్లులాగా, వెన్నెల కిరణాల్లాగా గగనం వైపు వ్యాప్తిచెంది ఆ ప్రాంతం పట్టపగల్లా వెలుగుల మయమయింది.

ఆ వెలుగు మధ్యలోంచి లిఫ్టులోంచి పైకి వస్తున్నట్టు ఒక ఆకారం పైకి వచ్చింది. అతడు మనిషా, దైవమా తెలీనంతగా తేజోమయంగా వెలిగిపోతున్నాడతను. నిప్పులో దూకి పునీతుడై బైటికొస్తున్న దైవాంశ సంభూతుడిలా వున్నాడతను. అతన్ని పూర్తిగా వీక్షించటం సెంట్రీకి సాధ్యంకాలేదు.

ఆ కాంతి పుంజాల్ని చీల్చుకుని–

ఆ ఆకారం బయటికొచ్చింది.

అతడు ఇవతలకు వచ్చిన మరుక్షణం–

మంత్రం వేసినట్టు కాంతి వలయం అదృశ్యమైంది.

నేల మూసుకుపోయింది.

సుడిగాలులు ఆగిపోయాయి.

ఇప్పుడు భూకంపం లేదు.

ఎటు చూసినా కటిక చీకటి.

కీచురాళ్ళ రోద.

'ఏం జరిగింది? తను చూసిందంతా కల కాదుకదా? భూమిలోంచి లేచి వచ్చిన మహా పురుషుడు ఎక్కడ' తనలో తాను గొణుగుతూ లేచి చుట్టూ చూసాడు. చిమ్మ చీకట్లో కంటిముందు ఏముందీ కన్పించటం లేదు. ఉన్న ఒక్క కరెంటు బల్బు కూడా భూ ప్రకంపనలకి పగిలిపోయింది.

అటుఇటు గుడ్డివాడిలా ఆ చీకట్లలోనే తడుముకుని టార్చిలైటు చేజిక్కించుకుని లేచి టార్చ్ ఫోకస్ చేసాడు. ఏముందక్కడ? సొరంగం తాలూకు ఆనవాలు కూడ లేదు. పలుగులతో తిరగేసినట్టుంది అక్కడి నేల. జరిగిన విపరీతాలకు గుర్తుగా నేలకూలిన బారికేడ్ కర్రలు మాత్రమే సాక్ష్యంగా మిగిలాయి.

ఇంతలో టార్చ్ ఫోకస్ చేసుకుంటూ–

సిగరెట్ ముట్టించుకోడానికి వెళ్ళిన రెండో పోలీస్ పరుగులెత్తుకొస్తూ కన్పించాడు. అతను ఆయాసంతో రొప్పుతున్నాడు.

"ఏమైందిరా..... ఏం జరిగిందిక్కడ?" అనరిచాడు వస్తూనే

"నువ్వు చూసిందే జరిగింది" అన్నాడు అప్పటికి కాస్త తేరుకుంటూ గుండెల్ని చిక్కబట్టుకుంటూ.

"భూకంపం వచ్చిన శబ్దాలు, తుఫానుగాలి, ఆకాశంలోకి వెదజల్లే కాంతులు.... కంగారుపడి నేను వస్తున్నంతలోనే ఆగిపోయాయి. అంతలో చీకట్లలో ఎవరో ఒక మనిషి నన్ను రాసుకుంటూ వేగంగా రోడ్డుమీదకు పోవటం చూసాను. మొదట నువ్వనుకున్నాను. తీరా టార్చ్ ఫోకస్ చేస్తే నువ్వు కాదు. వాడు చాలా వేగంగా వెళ్ళిపోయాడు."

"వాడే.... ఆ కాంతిపుంజాలలోంచి ఎగసివచ్చిన కాలపురుషుడు వాడే.... వాడ్ని చూడాలన్న నా ప్రయత్నం ఫలించలేదు. కన్ను మూసి తెరిచేలోన అంతా జరిగిపోయినట్టయింది" అన్నాడు రెండో పోలీస్.

"కాల పురుషుడా.... ఆ వెలుగులోంచి ఒక మనిషి బయటికొచ్చాడా? నమ్మలేకపోతున్నాను. నువ్వు చెప్పిందే నిజమైతే భూమిని చీల్చుకొచ్చిన ఆ కాల పురుషుడు లోకానికి మంచి చేస్తాడో, లోకాన్ని నాశనం చేస్తాడో చూడాలి. అంతా కలికాల విచిత్రం. మనం ఇంకా ఇదే ఆలోచిస్తూ కూర్చుని లాభం లేదు. పై అధికారులకి ఫోన్ చేసి రిపోర్ట్ చేస్తాను" అంటూ తన సెల్ అందుకున్నాడు రెండో పోలీస్.

× × × ×

రాత్రి బాగా పొద్దుపోయిన వేళ.

సమయం పది గంటలు కావచ్చు.

ఆ వీధి చాలావరకు నిర్మానుష్యమైంది.

ఇళ్ళలో దీపాలు ఆరిపోతున్నాయి.

కాని ఆ వీధి మధ్యలో కుడిపక్కన ఉంది రెండు అంతస్థుల భవంతి. ఆ యింట్లో మాత్రం ఇంకా దేదీప్యమానంగా వెలుగుతూనే వున్నాయి లైట్లు. లోన నిద్రపోతున్నారో మెలుకూగా వున్నారో తెలీదు. నిర్మానుష్యంగా, నిశ్శబ్దంగా వున్న ఆ కట్టడంలో లైట్లు మాత్రం పట్టపగల్లా వెలుగుతూనే వున్నాయి.

కొద్ది రోజుల క్రితం వరకు ఆ యింట్లో ఈ పరిస్థితి లేదు. అందరి ఇళ్ళలోలాగే పదిలోపలే లైట్లన్నీ ఆరిపోయాయి. నానీ కన్పించకుండా పోయినప్పట్నుంచే ఈ పరిస్థితి.

ఆ ఇంటి యజమానురాలి పేరు చంద్రకళ.

ఆవిడ భర్త మిలటరీలో మేజర్‌గా పనిచేస్తూ గత యుద్ధంలో చనిపోయాడు. అప్పట్నుంచి చంద్రకళలో సగం ఆనందం హరించుకుపోయింది. తన యిద్దరు పిల్లలతో ఒంటరిగానే వుంటోంది. వీరమరణం పొందిన తన భర్తను పిల్లల్లో చూసుకుంటూ వాళ్ళ సంతోషమే తన సంతోషంగా జీవిస్తూ వచ్చింది.

కూతురు కర్తవ్యకి సంవత్సరం క్రితమే వైభవంగా వివాహం జరిపించింది. వాళ్ళు ఢిల్లీలో వుంటున్నారు. రెండో సంతానం కొడుకు అనుపమ్. చిన్నప్పట్నించి వాడ్ని ముద్దుగా నానీ అని పిలుస్తారు. తండ్రి రూపాన్ని పుణికిచ్చుకున్నాడు నానీ. ఆటపాటల్లో చదువుల్లో అన్నిటా ఫస్టే. బెస్ట్ స్టూడెంట్ అని పేరు తెచ్చుకున్నాడు. తన ఆశలన్నీ కొడుకు మీదే వుంచుకుంది చంద్రకళ. వాడు ఇంజినీరింగ్ చేయగానే పెళ్ళి చేసి ఒకింటివాడ్ని చేస్తే తనకిక ఏ చింతా వుండదని ఆవిడ ఆలోచిస్తున్నంతలో–

వూహించని విచిత్ర సంఘటన జరిగింది!

సిటీ బయట అడవిలో జరిగిన విచిత్రాన్ని చూడటానికి మిత్రులతో కలిసి వెళ్ళిన నానీ తిరిగి రాలేదు. ఏమయ్యాడో ఎవరూ చెప్పలేకపోతున్నారు. సుడిగాలి తాకిడికి అతను సొరంగంలో పడిపోయి ఉండే అవకాశాలే ఎక్కువని పోలీసులు చెప్పారు. అయినా గాలిస్తూనే వున్నామంటున్నారు. కాని నానీ మాత్రం ఇంతవరకు తిరిగి రానేలేదు. అప్పట్నుంచి కొడుకు కోసం బెంగపెట్టుకుని ఏడుస్తూనే వుంది చంద్రకళ. తల్లిని ఓదార్చటానికి ఢిల్లీ నుంచి వచ్చిన కూతురు కర్తవ్య ఉదయమే ఢిల్లీ వెళ్ళిపోయింది.

మనసులో ఎంత దుఃఖం వున్నప్పటికీ–

తన కొడుకు మరణించలేదనీ ఖచ్చితంగా బ్రతికివస్తాడనీ ఆమె గుండెలోతుల్లో ఆమెకే తెలీని ఏదో ధీమా, నమ్మకం. ఆ నమ్మకమే రోజు రోజుకు పెరుగుతుందేగాని తరగటం లేదు.

నానీకి చిన్నప్పట్నుంచి చీకటంటే భయం.

చిన్న దీపమైనా కనబడాలి.

లేదంటే అడుగు బయటపెట్టడు.

అందుకే మరి–

తన కొడుకు ఏ అర్ధరాత్రి తిరిగి వచ్చినా చీకటికి భయపడి వెనక్కి వెళ్ళిపోకూడదని ఈ వారం రోజులుగానూ రాత్రిళ్ళు తమ భవంతిలో లైట్లు అన్నీ ఆన్‌చేయించే వుంచుతోంది చంద్రకళ.

అంతక్రితం వరకూ కూడ కొడుకు మీది బెంగతోనే ఆలోచిస్తూ ఒంటరిగా చాలాసేపు ఏడుస్తూనే వుందావిడ. అలసిపోయి మాగన్నుగా నిద్రలోకి జారుకుంటున్న సమయంలో ఉన్నట్టుండి కాలింగ్ బెల్ మోగింది.

ఆ శబ్దం వినగానే–

ఝల్లుపడి లేచిందావిడ.

ఈ టైంలో ఎవరు వచ్చుంటారు?

తన బిడ్డకు సంబంధించి పోలీసులు ఏదన్నా సమాచారం తీసుకొచ్చారేమో.... ఏం వినాల్సివస్తుందో ఏమిటో.... అదురుతున్న గుండెల్ని చిక్కబట్టుకొంటూ బెడ్‌రూంలోంచి హాల్లోకి వచ్చిందావిడ. అప్పటికే మూడుసార్లు మోగింది కాలింగ్‌బెల్.

వేగంగా వెళ్ళి తలుపు తీసిందావిడ.

గుమ్మంలో నిలుచున్న యువకుడ్ని చూడగానే–

కెవ్వున అరిచింది.

ఎదురుగా డోర్‌లో–

చిరునవ్వులు చిందిస్తూ నిలబడున్నాడు తన బిడ్డ.

తన గారాల కొండ.

తన ఆశాదీపం.

ఇది కలకాదు గదా!

ఈ కల చెదిరిపోదుగదా!

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Adharvana+Yagnam**

* * *